

సైబర్ ఉచ్చులో యువకుడు

దామెర మండలం ఊరుగొండకు చెందిన ఓ యుకుడు సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కి రూ.1,36,500 పోగొట్టుకున్నాడు.

- 8లో▸



సరిహద్దుల్లో పోలీస్‌బాస్

తెలంగాణ, మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కాళేశ్వరంలో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పర్యటించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
36^0/24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండ తీవ్రత పెరిగి ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువ అవుతుంది.

న్యూస్‌రీల్

స్వామివారి నగల పరిశీలన



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామివారి నగలను సోమవారం దేవాదాయ శాఖకు చెందిన జేవీఓ(జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి) అంజనీదేవి పరిశీలించారు. ముందుగా ఈఓ లక్ష్మీప్రసన్నతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి చెందిన నగలు, వెండి, బంగారం, ఇతర వస్తువులను వేరు చేయించారు. కాగా ఈ ప్రక్రియ సాయంత్ర వరకు పూర్తి కాకపోవడంతో మంగళవారం తూకం వేయిస్తామని చెప్పారు. సిబ్బంది, రమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో మరోసారి విచారణ



నర్మెట: అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూవివాదంలో జోక్యం చేసుకున్న ఆరోపణలతో నర్మెట సీఐ, ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడిన విషయం విదితమే. సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు జనగామ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ అమ్మాపురం గ్రామంలో సోమవారం రెండోసారి క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ భూమికి సంబంధించిన అన్నదమ్ములైన చెక్కిల్ల లక్ష్మయ్య, చెక్కిల్ల వెంకటేశ్వర్లు, చెక్కిల్ల రవీందర్‌లను సాక్షులు, గ్రామస్తుల సమక్షంలో విచారించి వివరాలను నమోదు చేసుకున్నారు. సమగ్ర నివేదికను సీపీకి అందించనున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట తరిగొప్పుల ఎస్సై దూదిమెట్ల నరేష్, హెచ్‌సీ గట్టయ్య, పీసీలు వల్లె ధనుంజయ్, కెంగెర్ల రమేష్, గోపాల ప్రవీణ్, ఎండీ.హమీద్ తదితరులు ఉన్నారు.

నేడు అవార్డుల ప్రదానం

జనగామ రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు మంగళవారం(నేడు) అవార్డులు ప్రదానం చేయనున్నట్లు డీఈఓ కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడున ఉన్న సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందని అందరూ హాజరు కావాలని కోరారు. సెప్టెంబర్ 5వ తేదీన చేపట్టాల్సిన అవార్డుల ప్రదానోత్సవం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పందుల పెంపకానికి స్థలాలు కేటాయించాలి



జనగామ: జిల్లాలోని అన్ని మండలాల్లో పందుల పెంపకానికి ఎరుకల కులస్తులకు పిగ్ ఎంపవర్‌మెంట్ స్కీం కింద స్థలాలు కేటాయించాలని సంఘం నాయకులు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలో పెంపకందారుల సొసైటీలు ఏర్పాటు చేశామని, తహసీల్దార్ నేతృత్వంలో ప్రభుత్వ భూమి కేటాయిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే వెటర్నరీ వైద్యులు, జిల్లా అధికారి ఆధ్వర్యంలో సొసైటీల రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని నాయకులు కోరారు. జనగామ పట్టణ పందుల పెంపకందారులకు చంపక్‌హిల్స్‌లో రెండెకరాల స్థలం కేటాయించారని, తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వే చేయించి సర్టిఫైడ్ కాపీ ఇప్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఏకలవ్య ఎరుకుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

నేషనల్ సైన్స్‌ఫెయిర్‌లో ఝాన్సీబాయి ప్రతిభ



దేవరుప్పుల : ఢిల్లీలో కొనసాగుతున్న నేషనల్ సైన్స్‌ఫెయిర్‌లో మండలంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని కున్సోతు ఝాన్సీబాయి ప్రతిభ కనబర్చింది. 'స్పీచ్ టూ బ్రెయిలీ టీచింగ్ డివైజ్' అనే అంశంపై సోమవారం ఇచ్చిన ప్రదర్శనకు న్యాయ నిర్ణేతలు ముగ్ధులయ్యారని పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లోనూ రాణించిన ఝాన్సీబాయి నేషనల్ లెవల్‌కు ఎంపికైందని పేర్కొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



తొర్రూరు సభకు హాజరైన ప్రజలు, పార్టీ కార్యకర్తలు

కేసీఆర్ సర్కారును గెలిపించాలి

- రాష్ట్ర రూపురేఖలు మార్చిన సీఎం
- డాలర్లతో వస్తున్నారు జాగ్రత్త
- వాళ్లు ఇచ్చిన డబ్బులు తీసుకోండి
- మోసాన్ని మోసంతోనే జయించాలి
- దయాకర్‌రావు గెలుపు ఖాయం
- తొర్రూరు సభలో రాష్ట్ర మంత్రి కేటీఆర్

సాక్షి, మహబూబాబాద్/తొర్రూరు: రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్ సర్కారును మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు కోరారు. సోమవారం తొర్రూరు పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత పల్లెలన్నీ బాగుపడ్డాయని అన్నారు. ఏడుసార్లు ప్రజల మద్దతులో గెలిచిన దయాకర్‌రావు మరోసారి గెలుస్తారని.. ఇక్కడికి వచ్చిన జనం చప్పట్లే చెబుతున్నాయన్నారు. సంక్రాంతికి గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లు ఎన్నికలు అనగానే కాంగ్రెస్ నాయకులు వస్తున్నారని ఎద్దేవా చేశారు. వారి మాటలు నమ్మకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గానికి విదేశాల నుంచి డాలర్లు తెచ్చి ఎన్నికల్లో ఖర్చుపెట్టేందు సిద్ధమవుతున్నారని, వారి డబ్బులు తీసుకొని ఓటు మాత్రమ కారు గుర్తుకు వేయాలన్నారు. మనల్ని మోసం చేసేందుకు వస్తున్న వారికి మోసంతోనే బుద్ధి చెప్పాలని సూచించారు.

వందలాది గంగదేవిపల్లెలు..

గతంలో ఆదర్శ గ్రామం అంటే గంగదేవిపల్లె అని చెప్పేవారని, ఇప్పుడు వందలాది గంగదేవిపల్లెలను తయారు చేసిన పాలన బీఆర్‌ఎస్‌ది అని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రతీ జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇవి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ ఎన్నికలు అనుకుంటే పొరపాటు.. రాష్ట్ర ప్రజల తలరాతను మార్చే ఎన్నికలు అని చెప్పారు. ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు.

50 పడకల ఆస్పత్రి, మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన



పాలకుర్తిలో 50 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు



మినీ టెక్స్‌టైల్ పార్క్‌శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ తదితరులు

పాలకుర్తి/కొండకండ్ల : పాలకుర్తిలో 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రి భవనం, అలాగే కొడకండ్ల మండలకేంద్రంలో మినీ టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి మంత్రి దయాకర్‌రావు శంకుస్థాపన చేశారు. షెడ్యూల్ ప్రకారం మంత్రి కేటీఆర్‌చే సాయంత్రం 6.30 గంటలకు మినీ టెక్స్‌టైల్ పార్కు శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. ఎన్నికల కోడ్ వస్తుందనే ముందస్తు సమాచారంతో ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ శివలింగయ్యతో కలిసి మంత్రి దయాకర్‌రావు హడావుడిగా కార్యక్రమం పూర్తి చేశారు. అలాగే పాకాల గ్రామంలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభించారు. రూ.17.50 కోట్ల వ్యయంతో అధునాతన హంగులతో ఆస్పత్రిని అభివృద్ధి చేయనున్నట్లు చెప్పిన మంత్రి.. మినీ టెక్స్‌టైల్ పార్క్ కోసం రూ.62 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, ఎంపీపీలు జ్యోతి, నాగిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్, మార్కెట్ చైర్మన్ రాము, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, బీఆర్‌ఎస్ నాయకులు సిందె రామోజీ, పసునూరి నవీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధిచేశా.. అవకాశమివ్వండి : మంత్రి ఎర్రబెల్లి

నియోకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాను. మరోసారి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరు సభలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో టికెట్ రాకపోయినా.. ప్రజల మధ్య ఉండి పనిచేశాను.. ఎన్నికల్లో పార్టీ మేనిఫెస్టోతో పాటు సొంత మేనిఫెస్టో తయారు చేసుకుంటానని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేర్చి ప్రజలను కంటికి రెప్పలా చూసుకున్నానని చెప్పారు. సభలో ఎంపీలు దయాకర్, మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రెడ్యానాయక్, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు ఆంగోతు బింధు, గండ్ర జ్యోతి, పాలకుర్తి దేవస్థానం చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మున్సిపల్ చైర్మన్లు మంగళంపల్లి రాంచంద్రయ్య, రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీలు తూర్పాటి చిన్నఅంజయ్య, రాజేశ్వరి, భార్గవి, బస్వ సావిత్రి, జెడ్పీటీసీలు రంగు కుమార్, శ్రీరాం జ్యోతిర్మయి, శ్రీనివాస్, పుసుకూరి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారానికి అదనపు నిధులు కేటాయించాలి

- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నభోజన కార్మికుల ధర్నా

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం కేసీఆర్ ఇటీవల ప్రవేశ పెట్టిన అల్పాహారం పథకానికి అదనపు నిధులు కేటాయించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి విజేందర్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు పది రోజులుగా సమ్మె చేస్తున్నా సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని, లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే.. తమ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమంలో ఆదిలక్ష్మి, ఎల్లమ్మ, రాణి, జె.బున్నిసా, కవిత, ఇందిర, అంజమ్మ, నజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

డీటీడీఓను సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

జనగామ రూరల్: జిల్లా కేంద్రం సమీపాన ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని వార్డెన్‌పై ఫిర్యాదు చేసినా చర్య తీసుకోని డీటీడీఓ ప్రేమలతరెడ్డిని సస్పెండ్ చేయాలని గిరిజన సంఘం నాయకుడు అజ్మీరా సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోనూ పాటించకుండా.. సమయ పాలన లేకుండా విధులు నిర్వహిస్తున్న వార్డెన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. తాము విధులు నిర్వహించలేమని గత నెల 16న లేటర్ ఇచ్చిన వార్డెన్‌ను తొలగించకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మల్లేష్, గణేష్, బాలు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు తెరపైకి 'అవిశ్వాసం'

- మున్సిపల్ అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల రహస్య సమావేశాలు
- హైకోర్టు స్టే ఎత్తివేయడంతో ముందడుగు
- చైర్‌పర్సన్ లక్ష్యంగా ముందుకు..
- ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్ వద్దకు



రహస్య సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు

జనగామ: జనగామ మున్సిపల్ అవిశ్వాస రాజకీయం మరోమారు తెరపైకి వచ్చింది. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు కలిసి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడంతో.. వారు కోర్టుకు వెళ్లగా స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. చట్ట ప్రకారం అవిశ్వాస తీర్మాన ప్రక్రియ సాగుతోందంటూ హైకోర్టు స్టే ఎత్తివేయడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పి.జమునలింగయ్యపై మరోమారు అవిశ్వాసానికి తెరలేపుతున్నారు. అధికార పక్షానికి చెందిన కౌన్సిలర్లు మల్లవరపు అరవింద్‌రెడ్డి, బండ పద్మయాదగిరిరెడ్డి, మల్లిగారి చంద్రకళరాజు, కర్రె శ్రీనివాస్, జూకంటి లక్ష్మీశ్రీశైలం, పేర్ని స్వరూప, నీల రామ్మోహన్‌శ్రీజ, వాంకుడోతు అనిత, పాక రమ, గుర్రం భూలక్ష్మినాగరాజు, ఎండీ.సమ్మద్, దేవరాయ నాగరాజు మొత్తం 12 మంది సోమవారం రహస్యంగా సమావేశమయ్యారు. మరోవైపు కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు సైతం అవిశ్వాసంపై ఎలా ముందకెళ్లాలనే దానిపై చర్చించుకున్నట్లు సమాచారం. గతంలో ఎల్లమ్మ టెంపుల్‌లో చేసిన ప్రమాణానికి కట్టుబడి ఉండాలని అధికార పార్టీకి చెందిన సభ్యులు తీర్మానించుకున్నట్లు తెలుస్తున్నది.

ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్ వద్దకు..

అవిశ్వాసంపై హైకోర్టు ఎత్తివేసిన స్టే కాపీలను తీసుకునేందుకు అధికార పార్టీలో ఒకరికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో అధికార, ప్రతిపక్ష సభ్యుల సంతకాలతో కలెక్టర్ శివలింగయ్యను కలువనున్నట్లు సమాచారం.

ఇలా మొదలైంది..

2019 జనవరి 27న ప్రమాణస్వీకారం చేసిన కౌన్సిలర్లు, మూడేళ్ల పాటు బాగానే ఉన్నారు. వారికి పురపాలికలో సముచిత గౌరవం దక్కక పోవడం, ఒకరిద్దరి పెత్తనంతో తలెత్తుకోలేని పరిస్థితుల్లో అధికార, ప్రతి పక్ష పార్టీలకు చెందిన పలువురు సభ్యులు జతకట్టి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు. ఈ విషయమై బీఆర్‌ఎస్ అధిష్టానం సైతం పట్టించుకోకపోవడంతో కౌన్సిలర్లు కొంతకాలం క్యాంపు రాజకీయాలు నడిపించారు. ఈ సమయంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కోర్టుకు వెళ్లడంతో స్టే ఇచ్చింది.

సక్సెస్ అయ్యేనా..!

గతంలో హైకోర్టు స్టే ఇవ్వడంతో వెనక్కి తగ్గిన సభ్యులు.. ఈసారి అదే కోర్టు ఆదేశాల మేరకు చైర్‌పర్సన్‌ను ఎలాగైనా గద్దె దింపాలనే పట్టుదలతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రెండోసారి అవిశ్వాసంలోకి అడుగు పెడుతున్న అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఒకేమాటపై ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తమకు అనుకూలంగా ఉన్న కొంత మంది ప్రతిపక్ష కౌన్సిలర్లతో చర్చలు జరిపి మద్దతు కూడగట్టినట్లు వినికిడి. చైర్‌పర్సన్ పదవి ఎవరి కనే దానిపై గోప్యంగా ఉంచుతున్నారు. సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అవిశ్వాస రాజకీయం అధికార బీఆర్‌ఎస్‌లో అలజడి రేపుతుండగా.. అధిష్టానం నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయనే టెన్షన్ వాతావరణం నెలకొంది.

ప్రగతి భవన్ నుంచి పల్లా, ముత్తిరెడ్డికి పిలుపు

- ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేయత్నం
- ముఖ్యనేతలకు ఆహ్వానం
- నేడు జనగామ టికెట్‌కు 'పల్లా' పేరు అధికారికంగా ప్రకటించే అవకాశం..?

జనగామ: రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడిన నేపథ్యంలో జనగామ బీఆర్‌ఎస్ టికెట్ విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరదించేందుకు అధిష్టానం దృష్టి సారించింది. జనగామ టికెట్ పల్లా రాజేశ్వరెడ్డికి ఇవ్వడంకోసం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చారు. ఆ బాధ్యతలు చేపట్టిన ముత్తిరెడ్డి జనగామ బరిలో నేనే నంటూ హాట్ కామెంట్ చేయగా.. అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. దీంతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముత్తిరెడ్డి మధ్య సయోధ్య కుదిర్చేందుకు సీఎం కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తున్నది. సోమవారం ఉమ్మడి జిల్లా పర్యటన అనంతరం మంత్రి కేటీఆర్ తిరుగు ప్రయాణంలో తన హెలికాప్టర్‌లో ముత్తిరెడ్డిని హైదరాబాద్ తీసుకుపోగా.. అదే సమయంలో ఘట్‌కేసర్ అనురాగ్ యూనివర్సిటీలో ఉన్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సైతం కేసీఆర్ స్వయంగా ఫోన్ చేసి పిలిపించుకున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇద్దరితో కలిసి అర్ధరాత్రి వరకు చర్చలు జరుపగా.. నేడు (మంగళవారం) నియోజకవర్గంలోని ముఖ్యుల సమక్షంలో కేసీఆర్ మాట్లాడనున్నారు. మున్సిపల్,, మార్కెట్ చైర్మన్లు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్లు, మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్లు, మరికొంత మంది నాయకులకు ప్రగతి భవన్ నుంచి ఫోన్ రాగా, ఉదయం 9 గంటల వరకు వారు వెళ్లనున్నారు. అందరి సమక్షంలో నేడు సీఎం జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు ఖరారు చేయనున్నట్లు సమాచారం.

మోగిన నగారా..



- అమలులోకి ఎన్నికల నియమావళి
- 24 గంటలపాటు 1950 నంబర్ సేవలు
- 11 బార్డర్ చెక్‌పోస్టులు .. 3వ తేదీ నుంచి తనిఖీలు షురూ
- ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి
- మహిళా, మోడల్, యూత్, వికలాంగులకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు
- దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగం
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్.శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు. కలెక్టరేట్ మీడియా పాయింట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓలు, రిటర్నింగ్ ఆఫీసర్లు మురళీకృష్ణ, రామ్మూర్తితో కలిసి మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నుంచి లిఖిత పూర్వక అనుమతి తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో మోడల్ కోడ్‌ఆఫ్ కండక్టు టీమ్స్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్ బృందాల నిఘా ప్రారంభమైందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటన జారీ అయ్యే నవంబర్ 3 నుంచి జిల్లా వ్యాప్తంగా స్టాటిక్ సర్వెలైన్స్(చెక్ పోస్టుల ఏర్పాటు) తనిఖీలు మొదలవుతాయన్నారు. రూ.10 క్షల లోపు నగదు పట్టుబడితే జెడ్పీ సీఈఓ ఆధ్వర్యాన పనిచేసే సీజ్ కమిటీ పూర్తి ఆధారాలు పరిశీలించి కరెక్టుగా ఉంటే తిరిగి అప్పగిస్తుందన్నారు. రూ.10 లక్షలకు పైగా ఉంటే ఆధారాలతో పాటు ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్‌కు సమాచారం ఇస్తుందని తెలిపారు. కాగా గోడలపై పార్టీల రాతలు, ఫ్లెక్సీలు, జెండాలు, ఇతర ప్రచారానికి సంబంధించిన వాటిని తొలంగించనున్నట్లు పేర్కొన్నారు.

861 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 861 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, నామినేషన్లను జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ కార్యాలయాల్లో ఆర్‌ఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, పాలకుర్తి తహసీల్ కార్యాలయంలో ఆర్‌ఓ, రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ స్వీకరిస్తారని చెప్పారు. అలాగే ఎన్నికల సామగ్రి పంపిణీ జనగామ, పాలకుర్తిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పెంబర్తి వీబీఐటీ కళాశాలలో ఉంటుందని, కలెక్టరేట్ కార్యాలయంలో కమ్యూనికేషన్ కంట్రోల్ రూం, ఎంసీఎంసీ టీం, సోషల్ మీడియా బృందాలతోపాటు 1950 టోల్‌ఫ్రీ నంబర్ 24 గంటలు పని చేస్తుందని వివరించారు.

ప్రత్యేక, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో ప్రత్యేక మహిళా, యూత్, దివ్యాంగుల కోసం 21 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో మహిళలకు 15, దివ్యాంగులకు 3, యూత్‌కు 3 ఉంటాయని చెప్పారు. జిల్లాలో 407 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు గుర్తించామని, అందులో జనగామ 164, స్టేషన్‌ఘన్‌పూర్ 92, పాలకుర్తి 151 ఉన్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ప్రత్యేక వెబ్‌కాస్టింగ్, ఎలక్షన్ అధికారుల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు..

జిల్లాలో 80ఏళ్లు పైబడిన వృద్ధ ఓటర్లు 14,289, దివ్యాంగులు 15,928 మంది ఉన్నారని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఐదు రోజులలోపు దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించే అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది మాత్రం డిస్ట్రిబ్యూషన్ పాయింట్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ల్లో ఓటు వేయాల్సి ఉటుందని తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం..

జిల్లాలో వెయ్యి మంది పురుష ఓటర్లు ఉంటే.. మహిళా ఓటర్లు 1,003 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. మొత్తం మూడు నియోజకవర్గాల్లో మొత్తం 7,16,023 ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 3,57,514, మహిళలు 3,58,757 మంది ఉన్నట్లు వివరించారు. ఇందులో ట్రాన్స్‌జెండర్లు 19, సర్వీసు 438, ఏఆర్‌ఐ ఓటర్లు 17 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

మూడో తేదీ నుంచి చెక్ పోస్టులు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నవంబర్ 3వ తేదీ నుంచి మూడు నియోజకవర్గాల పరిధి బార్డర్లలో 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. మండల పరిధిలో ఎంపీడీఓల(ఎంసీసీ బృందాలు) పర్యవేక్షణలో నిఘా ఉంటుందని, నామినేషన్ వేసిన నాటి నుంచి అభ్యర్థులు లెక్కలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. వారి వెంట కలెక్టరేట్ ఏఓ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి

వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

సాధారణ ఎలక్షన్ల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నాయకుల ఫొటోలు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, ప్రైవేట్ స్థలాల్లో ఉన్న ఫొటోలను వెంటనే తొలగించాలని చెప్పారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎన్నికల కోసం సర్కారుకు సంబంధించిన ఎటువంటి మిషనరీ వినియోగించవద్దని చెప్పారు.

మీడియా పాయింట్ ప్రారంభం

జనగామ: ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌ను కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య సోమవారం ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని, ఆర్డీఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, కలెక్టరేట్ ఏఓ రవీందర్, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెండాల తొలగింపు మొదలు

జనగామ: సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, గోడలపై రాతలు, హోర్డింగ్‌లను అధికారులు తొలగిస్తున్నారు. పట్టణంతో పాటు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచార అస్త్రాలను తొలగిస్తూ.. గోడలపై ఉన్న రాతలను చెరిపి వేస్తున్నారు.



జనగామ పట్టణంలో జెండాలు తొలగిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని పాత రైల్వేగేటు సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతున్న వృద్ధుడు తూడి ఎల్లయ్య(73)ను డౌన్ లైన్‌లో వెళ్తున్న రైలు ఢీకొట్టగా మృతిచెందాడు. జీఆర్‌పీ హెచ్‌సీ ఆర్.రమణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శివునిపల్లికి చెందిన ఎల్లయ్య వ్యక్తిగత పనులపై సోమవారం ఘన్‌పూర్‌కు వచ్చిన తిరిగి శివునిపల్లికి వెళ్లేందుకు పాత రైల్వేగేటు వద్ద నుంచి రైల్వేట్రాక్ దాటుతున్నాడు. అతడికి చెవులు వినబడవని, దీంతో రైలు వచ్చిన విషయాన్ని గుర్తించక ఢీకొట్టగా మృతి చెందాడు. మృతుడికి భార్య పోచమ్మ, కూతురు ఉమ ఉన్నారు. కాగా జనగామ జీఆర్‌పీ హెచ్‌సీ రమణారెడ్డి, పీసీ సీహెచ్.నరేష్‌యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గేటు మూసినా ప్రమాదాలు..

ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాలకు కలుపుతూ ఉండే రైల్వేగేటును ఇటీవల రైల్వే అధికారులు పూర్తిగా మూసేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి సౌకర్యం ఉన్నప్పటికీ కొందరు గేటు మార్గం వద్ద అడ్డుగా ఉన్న సిమెంట్ బ్లాక్‌లను తొలగించారు. అయినా గేటు మూసి ఉన్న కాలినడకన వెళ్లే వారు ఈ మార్గం నుంచే వెళ్తున్నారు. నెల రోజులలోపే ఇక్కడ మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు..


సోమ్లా నాయక్ (ఫైల్)

రాయపర్తి : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని బాల్ నాయక్‌తండా శివారు వసురాంతండాలో సోమవారం జరిగింది. ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. వసురాంతండాకు చెందిన భూక్యా సోమ్లా నాయక్(55) ఆదివారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మోటార్‌ను సరిచేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.ఎంతకీ ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతున్న రైతు..

నెల్లికుదురు: చికిత్స పొందుతున్న ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మదనతుర్తిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్వత యాకన్న (39) వరి పంటకు తెగులు సోకి పంటంతా దెబ్బతిన్నది. పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. దీంతో పొలం వద్ద ఈనెల 3న గడ్డి మందు తాగాడు. వెంటనే అతడిని ఖమ్మం ఆస్పత్రికి తరలిచగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

సరిహద్దుల్లో పోలీస్‌బాస్

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో విస్తృత తనిఖీలు
- మద్యం, నగదు, డ్రగ్స్, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా
- రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ సుడిగాలి పర్యటన


కాళేశ్వరం వద్ద బార్డర్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీజీపీ అంజనీకుమార్

కాళేశ్వరం : తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కాళేశ్వరంలో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ సోమవారం పర్యటించారు. భూపాలపల్లిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఆయన హాజరయ్యారు. అక్కడి నుంచి నేరుగా కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన బార్డర్ చెక్‌పోస్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత కాళేశ్వరం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి, విలేకరులతో మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిందని, దీంతో తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్స్ ప్రారంభించామన్నారు. కాళేశ్వరం బార్డర్‌లో తీసుకోవలసిన అంశాలపై ఇక్కడి పోలీసులతో చర్చించినట్లు తెలిపారు. అదే విధంగా ఎన్నికల నియమావళి ప్రకారం మద్యం, నగదు, డ్రగ్స్‌తో పాటు నిషేధిత వస్తువుల సరఫరా, ఉచిత వస్తువుల పంపిణీకి అడ్డుకుంటామని, పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు పోలింగ్ రోజున ఓట్లు వేసేందుకు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అనంతరం కాళేశ్వరం పరిధిలోని లక్ష్మి పంప్ హౌజ్, మేడిగడ్డ బ్యారేజ్‌లను డీజీపీ సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

రెండు గంటలు ఇక్కడే..

మధ్యాహ్నం 12.25 గంటలకు కాళేశ్వరం చేరుకున్న డీజీపీ 2.15 గంటల వరకు ఉన్నారు. ముందుగా కాళేశ్వరాలయంలో పూజలు చేసిన అనంతరం స్థానిక హరిత హోటల్‌లో పోలీసులతో సమావేశం నిర్వహించారు. అక్కడే భోజనం చేసి, అంతరాష్ట్ర వంతెన, పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. డీజీపీ పర్యటన ఉండడంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ కిరణ్, ఎస్సై లక్ష్మణ్‌రావు, పోలీసులు ఉన్నారు.

కేయూలో విద్యార్థి జేఏసీ దీక్షల విరమణ


విద్యార్థులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న వినయ్‌భాస్కర్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 34 రోజులుగా విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారం తాత్కాలికంగా విరమించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలను తాము ప్రశ్నించి ఆందోళన చేస్తే టాస్క్‌ఫోర్స్ పోలీసులచే కొట్టించారని అందుకు బాధ్యులైన వీసీ, రిజిస్ట్రార్లను బర్తరఫ్ చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. కాగా విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఇటీవల హనుమకొండకు వచ్చిన మంత్రి కేటీఆర్ విద్యార్థులకు క్షమాపణ చెప్పడంతోపాటు పీహెచ్‌డీ అడ్మిషన్లపై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అందుకు తాను బాధ్యత తీసుకుంటున్నాని తెలిపారు. విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు సీ.పీ రంగనాథ్‌తో మాట్లాడుతానని వెల్లడించారు. తొలుత దూరవిద్యాకేంద్రంలోని డైరెక్టర్ ఆఫీస్ గదిలో వినయ్‌భాస్కర్ విద్యార్థి జాక్ నాయకులతో, రిటైర్డ్ ఆచార్యులతో కొంత సేపు చర్చించారు.అనంతరం దీక్షలను విరమింపచేశారు. కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, నాయకులు మాచర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

19న రైల్వే సీసీఎస్ ఎన్నికలు

- కాజీపేట కేంద్రంగా 2,629 మంది ఓటర్లు
- 13 సీసీఎస్ డెలిగేట్ పదవులకు 36 మంది పోటీ

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ లిమిటెడ్ (ఈసీసీఎస్) ఎన్నికలు ఈ నెల 19వ తేదీన జరగనున్నాయని సోమవారం సీసీఎస్ డెలిగేట్స్ విలేకరులకు తెలిపారు. ఈ నెల 12వ తేదీన జరగాల్సిన సీసీఎస్ ఎన్నికలకు సంబంధించి కొందరు కోర్టును ఆశ్రయించగా 19వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు అధికారికంగా సీసీఎస్ ఎన్నికలు కాజీపేట ఓపెన్ లైన్‌లో జరుగనున్నాయని వివరించారు. కాజీపేట రైల్వే సీసీఎస్ 11వ నియోజకవర్గం పరిధిలో కాజీపేట–జనగామ, దర్గా యూనిట్ నంబర్–1, కాజీపేట రైల్వే ఇంజినీరింగ్ నార్త్ యూనిట్ కేంద్రంగా మొత్తం 2,629 మంది సీసీఎస్ ఓటర్లుగా రైల్వే కార్మికులు ఉన్నారు. కాజీపేట కేంద్రంగా 13 మంది సీసీఎస్ డెలిగేట్స్ పదవులకు రైల్వే మజ్దూర్ యూనియన్ నుంచి 13 మంది, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నుంచి 13 మంది, ఇండిపెండెంట్స్ అభ్యర్థులు 10 మందితో కలిపి మొత్తం 36 మంది బరిలో ఉన్నారు.

అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

హసన్‌పర్తి : టీవీఎస్ ట్రెయినింగ్ అండ్ సర్వీసెస్ కంపెనీతో ఎస్సార్ యూనివర్సిటీ సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఇరువురు ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. పరిశ్రమలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల విద్యార్థులకు నూతన సాంకేతికను తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ టీఎస్‌వీ టీఎస్ ప్రై.లి. మహ్మద్ సమీయొద్దీన్ మాట్లాడుతూ.. హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్‌పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ ఒప్పందం ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు ఈ పరిశోధనల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇర్ఫాన్, సుధాకర్, వినోద్‌కుమార్, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌పై వరుసకు బాబాయి అయిన ఓ కామాంధుడు ఐదు నెలల క్రితం అత్యాచారం చేయగా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా స్థానిక పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు తెలిపిన వివరాలు.. ఓ గ్రామానికి చెందిన మైనర్ (15)పై అదేగ్రామానికి చెందిన వరుసకు బాబాయి అయిన యువకుడు (ఆటోడ్రైవర్) లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇటీవల బాధితురాలికి జ్వరం వస్తే తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఆమెను పరీక్షించి ఐదునెలల గర్భవతి అని చెప్పడంతో తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. కూతురును నిలదీయడంతో విషయం బయటకు వచ్చింది. ఈ మేరకు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

20కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్, మరో ఇద్దరు పరారీ


గంజాయి, నిందితులను చూపుతున్న ఏసీపీ

కాజీపేట : రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ప్రయాణికులను నిలిపి తనిఖీ చేయగా వారి వద్ద 20కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేశామని మరో ఇద్దరు పరారైనట్లు ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ మేరకు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రానికి చెందిన టేటు పాలై (40), రేణు సామేల్ (45) అనే వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి తనిఖీలు చేయగా గంజాయి లభ్యమైందన్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పోలీసుల రాకను చూసి పరారైనట్లు చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐలు అల్లం రాంబాబు, పెండ్యాల దేవేందర్, సీఐ సార్ల రాజు, ఎస్సైలు లలిత, రవికుమార్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీ


రైలులో లగేజీ తనిఖీ చేస్తున్న పోలీసులు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని అన్ని ప్లాట్ ఫామ్‌లపై తిరుగుతూ తనిఖీలు చేశారు. అనుమానస్పదంగా కనిపించిన లగేజీ బ్యాగులను పరిశీలించారు. అదే సమయంలో వరంగల్ స్టేషన్‌కు వచ్చిన ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి తనిఖీలు చేస్తూ.. కాజీపేట స్టేషన్ వరకు వెళ్లారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో నగదు, బంగారం ఇతర వస్తువులు తీసుకొస్తే వాటికి తగిన ఆధారాలు వెంట తెచ్చుకోవాలని ప్రయాణికులకు సూచించారు. ఈతనిఖీల్లో ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలు సాధించిన వారితో ప్రిన్సిపాల్

న్యూశాయంపేట : తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ(టెమ్రిస్) ఇంటర్ ఒకేషనల్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు ఎంఎస్ఎన్ ల్యాబొరేటరిస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ములుగురోడ్డులోని హనుమకొండ(బి)1 గురుకుల కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని డీఎండబ్ల్యూఓ మేన శ్రీను, ప్రిన్సిపాల్ డాక్టర్ జంగా సతీశ్ అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్లు బ్రహ్మనందరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

హడప్సర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి హడప్సర్ ట్రై వీక్లి ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం రైల్వే అధికారులు ప్రారంభించారు. కాగా ఈ ట్రై వీక్లి ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమ, గురు, శనివారాల్లో కాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 6:15 గంటలకు బయలుదేరుతుంది. జనగామ, భువనగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, బేగంపేట, లాథూర్‌లో హాల్టింగ్ కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సజ్జన్‌లాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మందలింపు..

- పాఠశాల భవనం నుంచి దూకిన విద్యార్థిని


పాఠశాల వద్ద ఆందోళనకు దిగిన కుటుంబీకులు

వరంగల్ : ఎల్‌బీ నగర్‌లోని దారుస్ ఉలూస్ ఫాతిమా నిస్వాన్ ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం నగరంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న బాలిక తోటి విద్యార్థులను దుర్భాషలాడడంతో తరగతి ఉపాధ్యాయురాలికి ఫిర్యాదు చేసింది. దీంతో ఉపాధ్యాయురాలు సదరు బాలికను మందలించి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక పాఠశాలలోని మొదటి అంతస్తు నుంచి దూకింది. నోటికి దెబ్బతగిలి దంతాలు ఊడిపోవడంతో పాఠశాల యాజమాన్యం వెంటనే చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే బాలిక తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగడంతో నిర్వాహకులు వారిని సముదాయించారు. సంబంధిత ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఘటన స్థలానికి పోలీసులు వచ్చినప్పటికి అప్పటికే సమస్య పరిష్కారం కావడంతో వారు వెళ్లి పోయారు.

దోపిడీ కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

- నేరస్తులు గుంటూరు, పల్నాడు జిల్లావాసులు

వరంగల్ లీగల్ : అద్దె ఇంట్లో ఉంటు ఆ ఇంటి యజమానులైన వృద్ధ దంపతులకు మత్తు పానీయాలు ఇచ్చి దోపిడికి పాల్పడిన నేరంలో గుంజ పద్మ, గుంటూరు జిల్లా, బత్తుల బాబు, పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురు నేరస్తులకు పదేళ్ల జైలు, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ వరంగల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు ఇచ్చారు. పీపీ షేక్ అబ్దుల్ నబి కథనం ప్రకారం.. వరంగల్‌లోని శివనగర్ బీసీ హాస్టల్ సమీపంలో దాసరి కొమురయ్య–కళావతి కిరాణ షాపు పెట్టుకొని నివసిస్తున్నారు. ఈ క్రమంలో గుంజ పద్మ, బాబు తాము నూతనంగా వివాహం చేసుకున్నామని మేస్త్రీ పని చేసుకునేందుకు నగరానికి వచ్చామని తెలిపి, అద్దె గది కావాలని నెల కిరాయి అడ్వాన్స్‌గా చెల్లించారు. అనంతరం 2015, ఫిబ్రవరి 12న తమ వివాహ రోజు అని నమ్మించి పాయసం చేసామని తాగమని వృద్ధ దంపతులకు, మరో గదిలో అద్దెకు ఉండే వారికి ఇచ్చారు. అది తాగిన కొమురయ్య–కళావతి మత్తులోకి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన నిందితులు వృద్ధ దంపతులు ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బంగారాన్ని దోచుకొని పరారయ్యారు. పక్క రూంలో అద్దెకు ఉన్న వారు పాయసాన్ని తాగకుండా పక్కన పెట్టారు. మరుసటి రోజు తెల్లవారు జామున దంపతుల కిరాణంలో పాల కొనుగోలుకు వచ్చిన వారు వీరు ఎంతకు లేవకపోయే సరికి పక్కకు అద్దెకు ఉండే వారికి పిలిచి చెప్పారు. వాళ్ల వెంటనే స్పందించి స్పృహ కోల్పోయి మంచంలో పడి ఉన్న దంపతుల గురించి వారి పిల్లలకు తెలపగా వారు మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీం ఆధారంగా కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు వృద్ధులకు పాయసంలో మత్తు మందు కలిపి ఉద్దేశపూర్వకంగా దోపిడికి పాల్పడ్డారని రుజువు కావడంతో 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారు. కేసును అప్పటి మిల్స్ కాలనీ సీఐ, ప్రస్తుత నాగర్‌కర్నూల్ డీఎస్పీ సత్యనారాయణ పరిశోధించారు. లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి, కానిస్టేబుళ్లు జ్ఞానేశ్వర్, ప్రతాప్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

పోలీసుల చేయూత

- క్రీడల్లో ప్రోత్సహిస్తూ.. ఉపాధికి మార్గం చూపిన ఖాకీలు
- క్రికెట్‌లో ఆల్‌రౌండర్.. పనిలో నంబర్ వన్‌గా సాయిప్రసాద్


పోలీసుల సహకారంతో ఏర్పాటు చేసిన లాండ్రీ షాపులో దుస్తులు ఇస్త్రీ చేస్తున్న సాయిప్రసాద్

హన్మకొండ : ఖాకీలంటే కాఠిన్యమే కాదు.. బతుకు బాటచూపే నిర్దేశకులు.. ప్రతిభకు పట్టం కట్టి బంగారు భవిష్యత్ బాటలు వేసే మార్గదర్శకులని నిరూపించారు. నా అంటూ ఎవరూ లేని ఓ నిరుపేద యువకుడికి తాము ఉన్నామంటూ అండగా నిలుస్తున్నారు. కులవృత్తిని నిర్వహిస్తూ.. సొంతంగా ఉపాధి పొందుతున్నాడు. అంతటితో ఆగకుండా తనకు ఇష్టమైన క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా తుక్కడ మండలంలోని రావిరాలకు చెందిన ఉప్పురూతుల సాయిప్రసాద్ హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సాయిప్రసాద్ క్రికెట్ ఆట తీరును గమనించిన కొందరు పోలీసులు శభాష్ అని భుజం తట్టారు. వారు ఆడే ప్రతి టోర్నమెంటుకు సాయిని తీసుకెళ్లే వారు. ఆల్‌రౌండర్‌గా రాణించే సాయి ప్రతిభను గుర్తించిన పోలీసులు ప్రతి టోర్నమెంటుకు ప్రోత్సహించి సొంత ఖర్చులతో పంపించేవారు. సాయిప్రసాద్ తండ్రి చనిపోగా. తల్లి స్వగ్రామంలో కులవృత్తి చేస్తుంది. కాగా వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు ఆటలో మెళకులవలు నేర్పిస్తూ, క్రీడా టోర్నమెంట్లను ఎప్పటికప్పుడు వివరిస్తూ సాయిని ప్రోత్సహిస్తూ వచ్చాడు. హనుమకొండలోని 9వ డివిజన్ గణేష్‌నగర్ అద్దె గదిలో ఉంటున్న సాయి ఓవైపు నర్సింగ్ కోర్సు చేస్తూనే బతకడానికి కులవృత్తిని ఎంచుకున్నాడు. పోలీసుల సహకారంతో కులవృత్తిలో భాగంగా దుస్తులు ఇస్త్రీ చేసుకుంటున్నాడు. ఐపీఎస్ వైభవ్ గైక్వాడ్, ఉదయ భాస్కర్, ఆర్ఐలు, సీఐలు, పోలీస్ కానిస్టేబుళ్లు తనకు అండగా నిలబడ్డారని సాయిప్రసాద్ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

15 నుంచి రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రులు

- ఆలయ ఈఓ కె.వెంకటయ్య


కరపత్రం ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్ తదితరులు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల గుడిలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ కె.వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు ఈఓ, దేవాలయం ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ సోమవారం హనుమకొండలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ఉత్సవ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వెంకటయ్య, గంగు ఉపేంద్రశర్మ, వినయ్‌భాస్కర్ మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ దాత పల్లం రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉత్సవ సేవా సమితి సభ్యులు పులి రజనీకాంత్, గండ్రాతి రాజు, దేవాదాయశాఖ సిబ్బంది ప్రేమ్‌కుమార్, అర్చకులు సందీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ ‘బుక్ అయ్యారా’

- నగ్న వీడియో వల.. వదిలించుకోండిలా!
- రిపోర్ట్ కొట్టండి.. సెట్టింగ్ మార్చండి

కాజీపేట : కాజీపేటకు చెందిన యువకుడు సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కరోనా అనంతరం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంట్లోనే ఉంటూ పని చేసుకుంటున్నాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ మహిళతో న్యూడ్ కాల్ మాట్లాడి వారికి దొరికిపోయాడు. వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెడ్తానని బెదిరించగా రూ.10లక్షలు ముట్టజెప్పాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో చివరికి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా ఎంతో మంది.. ఎన్నో రకాలుగా మోసపోతున్న ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి.


పరిమితుల్లేని శృంగారం.. అవధుల్లేని ఆనందం ఆస్వాదిద్దాం.. అంటూ వాట్సాప్ కాల్స్ ద్వారా నగ్నంగా మాట్లాడుతూ ఆపై వీడియోలు తీసి బెదిరిస్తున్న సైబర్ నేరస్తుల వల నుంచి తప్పించుకోవచ్చని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని యువకులు, వృత్తి నిపుణులే లక్ష్యంగా పశ్చిమ బంగా, రాజస్తాన్ ముఠాలు వలపు వలలు విసురుతున్నాయి. బుట్టలో పడిన వారిని బెదిరించి లక్షల్లో నగదు బదిలీ చేయించుకుంటున్నారు. పరువు పోతుందన్న భావనతో పలువురు.. నిందితులు అడిగినంత డబ్బు పంపిస్తూ మోసానికి గురవుతున్నారు. ఇకపై అలా చేయొద్దని, సొంతంగానే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని పోలీసులు చెబుతున్నారు.

సాధ్యం కాదన్నా వినకుండా..

ఫేస్‌బుక్ ద్వారా యువకులు, వృత్తి నిపుణులను భరత్‌పూర్, కోల్‌కతాకు చెందిన యువతులు పరిచయం చేసుకుంటున్నారు. ఒకట్రెండు రోజులు ఫేస్‌బుక్‌లో మాట్లాడిన తర్వాత వాట్సాప్ నంబర్లు తీసుకుంటున్నారు. వాట్సాప్ కాల్ మొదలైన నిమిషానికే దుస్తులన్నీ విప్పేసి నగ్నంగా మారుతున్నారు. కొంతమంది యువతులు ప్రేమలోకి దింపి యువకుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఒక ఆటాడించి డబ్బులు దండుకుని వదిలేస్తున్నారు. మరికొంత మంది యువతులు ఒకటికి, రెండుసార్లు నగ్నంగా మారి వీడియో కాల్ చేయండని కోరుతున్నారు. ఇంట్లో ఉన్నాను.. బంధువులు, స్నేహితుల మధ్య ఉన్నాను. ఇప్పుడు చేయడం సాధ్యంకాదని చెప్పినా పదే పదే వీడియో కాల్ చేస్తుంటారు.

లొంగిపోతే ఇక బెదిరింపులే..

బాధితులు ఒత్తిడికి లొంగి వీడియో కాల్ చేయడం



మొదలు పెట్టగానే మీ ముఖం కనిపించేలా మాట్లాడాలని తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తారు. వెంటనే అవతలి వైపు నుంచి మాట్లాడుతున్న యువతి మరో కెమెరాతో మాటలు, నగ్న దృశ్యాలను రికార్డు చేస్తుంది. కాల్ పూర్తైనా నిమిషాలకే వీడియోను పంపించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తామంటూ భయబ్రాంత్రులకు గురి చేస్తుంటారు.

కొత్తగా మార్చుకోండి..

అసభ్యకరమైన, అశ్లీల వీడియోలు పంపుతామని నేరస్తులు చెప్పిన వెంటనే మీ టైమ్‌లైన్‌లో.. ‘నా ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యింది.. మీరు నాకు ఎలాంటి సమాచారం పంపొద్దం’టూ సందేశాన్ని పంపించండి. ఈ సందేశాన్ని హ్యాకర్ చూసినా మీకు ఎలాంటి ఇబ్బందులు రావు. స్మార్ట్‌ఫోన్‌లో ఫేస్‌బుక్ తెరవగానే.. మూడు చుక్కలు కనిపిస్తాయి. వాటిపై నొక్కితే రిపోర్ట్ అని వస్తుంది. అందులో ఎవరో మీలా నటిస్తున్నారా? అన్నవి తెరపైకి వస్తాయి. మమ్మల్ని అనుకరిస్తున్నారా? అన్న ఐచ్ఛికాన్ని ఎంచుకుంటే.. ఫేస్‌బుక్ ప్రతినిధులు హ్యాకర్‌ను తొలగిస్తారు. అప్పుడు మీ ఫేస్‌బుక్ సెట్టింగ్‌లను కొత్తగా మార్చుకోవాలి.

సైబర్ ఉచ్చులో యువకుడు

- రూ.1,36,500 పోగొట్టుకున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

దామెర : సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కిన ఓ యువకుడు ఏకంగా రూ.1,36,500 పోగొట్టుకున్న ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మోటె శరత్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గత ఏప్రిల్ నెలలో తన మొబైల్‌లో వాట్సప్ చూస్తున్న క్రమంలో పార్ట్‌టైమ్ జాబ్‌కు సంబంధించి వచ్చిన ఓ మెసేజ్‌ను అనుసరించాడు. తాను చెల్లించిన డబ్బులకు 30 శాతం అదనంగా వస్తాయని అవతలి నుంచి సైబర్ నేరగాడు నగదు ఆశ చూపించాడు. కాగా ఆ మెసేజ్‌లను నమ్మిన శరత్ మొదట రూ.5000లు తర్వాత రూ.33,500, రూ.40,000, రూ.8,000, రూ.50,000 మొత్తం రూ1,36,500లను సైబర్ నేరస్తుడు అడుగుతున్న విధంగా నగదును ట్రాన్స్‌ఫర్ చేశాడు. కాగా తాను మోసపోయానని ఏప్రిల్ 30న గ్రహించి సైబర్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేశాడు. దీంతో శరత్‌కు వచ్చిన అకనాలెడ్జ్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల వ్యవధిలో రెండు నేరాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. డబ్బు ఆశచూపే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎస్సై ముత్యం రాజేందర్ సూచించారు.